సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025



‘ఎంసీహెచ్’ సేవలు ఎప్పుడు?

మాతా శిశు ఆరోగ్య కేంద్రం ప్రారంభానికి గ్రహణం వీడటం లేదు.

వివరాలు 8లో ▸



అక్రమ రవాణాకు అడ్డేది?

రామాయంపేట కేంద్రంగా అక్రమ కలప రవాణా జోరుగా కొనసాగుతోంది.

వివరాలు 8లో ▸



డంపు.. కంపు మాకొద్దు

ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళనలు హోరెత్తాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

బీసీలకు 42శాతం రిజర్వేషన్ కేటాయించాలి



మాట్లాడుతున్న బీసీ సంఘాల నేతలు

సంగారెడ్డి రూరల్: ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బీసీ కులగణన తప్పులతడకగా ఉందని ఆ సంఘాల నాయకులు ఆరోపించారు. సంగారెడ్డిలోని బీసీ ఐక్యవేదిక జిల్లా కార్యాలయంలో సోమవారం వివిధ బీసీ కుల సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మేదర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మహేంద్ర, బీసీ నాయకులు మణయ్య, మల్లికార్జున పాటిల్ తదితరులు మాట్లాడుతూ.. కులగణన విషయమై ప్రభు త్వం పునరాలోచించి లోటుపాట్లను సవరించాలని కోరారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ చట్టబద్ధత చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలోసంఘం నాయకులు నాగభూషణం, రాజారాం, వెంకట హరి హరికిషన్, సాయి తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



సురేష్ కుమార్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగాధిపతి సురేష్ కుమార్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ అవార్డు వరించింది. వర్సిటీలోని భౌతిక శాస్త్ర విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ సాధన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఫిజిక్స్ ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో జరిగిన పరిశోధనలో సురేష్ కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కాగా తమ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్ రావడంతో ప్రిన్సిపాల్ సహా అధ్యాపకులు సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ప్రవీణ, డాక్టర్ యోగిబాబు, డాక్టర్ పూనం కుమారి, డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

సాంకేతికతను మరింత అభివృద్ధి చేసుకోవాలి


ఐఐటీ హైదరాబాద్ సాంకేతిక అధికారి డాక్టర్ సత్యానంద్



మాట్లాడుతున్న డాక్టర్ సత్యానంద్

పటాన్‌చెరు: విమానయాన భద్రతలో పెరుగుతున్న విమాన ట్రాఫిక్, మానవ తప్పిదాలు, ప్రమాదాల ప్రాబల్యం వంటి ముఖ్యమైన సమస్యలు కీలక భూమిక పోషిస్తున్నాయని, వాటిని అధిగమించేలా మనం సాంకేతికను అభివృద్ధి చేసుకోవాలని ఐఐటీ హైదరాబాద్‌లోని విశిష్ట సాంకేతిక అధికారి డాక్టర్ వెంకట సత్యానంద్ అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఏరోస్పేస్ విభాగం ఆధ్వర్యంలో ‘ఎయిర్ క్రాఫ్ట్ స్ట్రక్చరల్ సిస్టమ్ హెల్త్ మేనేజ్‌మెంట్, అడ్వాన్స్‌డ్ ఎయిర్ మొబిలిటీ’అనే అంశంపై ఆయన మాట్లాడారు. తక్కువ, అధిక ఎత్తులో ఉన్న ఎయిర్ స్పేస్ ఆపరేషన్‌లకు సంబంధించిన డయాగ్నస్టిక్స్, ప్రోగ్నో స్టిక్స్ పద్ధతులను వివరించారు ఆయా సవాళ్లను అధిగమించడానికి వినూత్న పరిష్కారాల అవసరాన్ని చెప్పారు. విజయవాడలో ఇటీవల సంభవించిన ఆకస్మిక వరదలు, అందులో డ్రోన్‌లను పోషించిన పాత్ర, వాటి విజయాలు, పరిమితులు, స్వయం ప్రతిపత్తి సాంకేతికతల ప్రభావాన్ని ప్రదర్శించడం వంటి ఆకర్షణీయమైన కేస్ స్టడీలను ఆయన విద్యార్థులతో పంచుకున్నారు. ‘డేటా ఉన్నప్పుడు, కృత్రిమ మేధస్సు ఉంటుందని, సమాచార యుగంలో, మీరు ఏ డేటాను ఉత్పత్తి చేయబోతున్నారు?’అనే ఆలోచింపజేసే ప్రశ్నతో తన ఉపన్యాసాన్ని ముగించారు.

నోరి పురస్కారం



సరస్వతిని సత్కరిస్తున్న చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రముఖ కవయిత్రి మంచీన్ల సరస్వతి నోరి పురస్కారాన్ని అందుకున్నారని బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం తెలిపారు. సోమవారం నగరంలో నోరి నరసింహశాస్త్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పురస్కారాన్ని అందించినట్లు తెలిపారు. పురస్కారాన్ని అందుకున్న సరస్వతికి జిల్లా కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

పరిషత్ పోరుకు కసరత్తు

పోలింగ్ కేంద్రాల గుర్తింపునకు ఆదేశం

- నేడు ముసాయిదా జాబితా విడుదల
- 13 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 15న తుది జాబితా ప్రకటన

సంగారెడ్డి జోన్: త్వరలో నిర్వహించే జిల్లా, మండల ప్రాదేశిక పరిషత్ ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభమైంది. పరిషత్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని ఎన్నికల సంఘం జిల్లా అధికారులను ఆదేశించింది. ఓవైపు గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు సాగుతుండగా.. తాజాగా పరిషత్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు ఆదేశాలు అందాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలను, వాటి స్థితిగతులను పరిశీలించి మౌలిక వసతులు కల్పిస్తూ పోలింగ్ కేంద్రాలను గుర్తించనున్నారు.

నేడు పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామాలలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు గుర్తించి, ముసాయిదా జాబితాను మంగళవారం విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. 13వ తేదీ వరకు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అదేవిధంగా 13న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాలపై సమీక్ష నిర్వహించనున్నారు. ఈనెల 14న అభ్యంతరాలను పరిష్కరించి తుది జాబితాను సిద్ధం చేసి కలెక్టర్ ఆమోదంతో 15న ప్రకటిస్తారు.

మౌలిక వసతులు కల్పిస్తూ కేంద్రాల గుర్తింపు

పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్ సరఫరా, దివ్యాంగులకు ర్యాంపు సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తూ పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తున్నారు. కేంద్రాలలో ఏవైనా అసౌకర్యాలు ఉంటే, వాటిని పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోనున్నారు.

ప్రత్యేక ఓటరు జాబితా

ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికల కొరకు వార్డుల వారీగా తుది ఓటరు జాబితాను ప్రకటించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల ఎన్నిక కొరకు ప్రత్యేకంగా ఓటరు జాబితాను రూపొందించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఈ విషయమై అధికారులు దృష్టి సారించారు.

276 ఎంపీటీసీ, 27ఎంపీపీ, జెడ్పీటీసీలు

జిల్లాలో 276 ఎంపీటీసీ (మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ), 27 ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలతో కూడిన తుది జాబితాను ఇటీవల జిల్లా అధికారులు విడుదల చేశారు. జిల్లాలో నూతనంగా గ్రామ పంచాయతీలు, మండలాల ఏర్పాటుతో పాటు పలు పంచాయతీలు మున్సిపాలిటీలో విలీనం కావడంతో గతంలో కంటే ప్రస్తుతం ఎంపీటీసీ స్థానాలు తగ్గి జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు పెరిగాయి.



మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి, చిత్రంలో మాధురి, మనోజ్, జానకిరెడ్డి తదితరులు

‘స్థానిక’ ఎన్నికలకు ఏర్పాట్లు చేయండి

సమీక్షలో కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్: గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ఆమె అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆర్‌ఓ, ఏఆర్ఓలు, పిఓ.,ఏపిఓలకు మాస్టర్ ట్రైనీలచే శిక్షణ ఇప్పిస్తామని, శిక్షణలో నియమ, నిబంధనలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా ఉండే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముందుగానే ఎంపిక చేసుకుని, నోటిఫికేషన్‌లో స్పష్టంగా వివరాలను పొందుపర్చాలని సూచించారు. 11వ తేదీన ఆర్ఓ, ఏఆర్ఓలకు జహీరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డి డివిజన్లలోనూ, 12, 13 తేదీలలో పీఓలకు, ఏపీఓలకు ఆయా మండల ప్రధాన కార్యాలయాలలోను, 15న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీపీవో సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపించండి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బీబీ పాటిల్

మాజీ ఎంపీ బీబీ పాటిల్

జహీరాబాద్/జోగిపేట: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులు బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి కోరారు. సోమవారం జహీరాబాద్, జోగిపేటలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డి, టీచర్స్ అభ్యర్థిగా కొమురయ్యలు పోటీ చేస్తున్నారని, వారిని ఉపాధ్యాయులు, పట్టభద్రులు అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొనేందుకు వీలుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సంఘటితంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, నాయకులు ప్రభారీ సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ శ్రీనివాస్‌గుప్తా, జగన్, అరుణకొణాస్, విజేందర్‌రెడ్డి, మల్లికార్జున్‌పాటిల్, సంతోష్, కృష్ణారెడ్డి, ప్రశాంత్ సుధీర్‌భండారి, వైద్యనాథ్, విశ్వనాథ్, శ్రీకాంత్, దుర్గయ్య, రమేష్‌రెడ్డి, అనిల్, నరేష్‌పాటిల్, అలాగే.. జోగిపేటలో మురళి యాదవ్, అనంతరావుకులకర్ణి, ప్రభాకర్ గౌడ్, ప్రభాత్, జగన్నాథం, జగదీశ్వర్, ముత్తిరెడ్డి, చంద్రశేఖర్, పట్టణ పార్టీ అధ్యక్షులు శివశంకర్, ఆంజనేయులు, భూమయ్య, గాజుల అనిల్ పాల్గొన్నారు.

అనుమతిలేని క్లినిక్‌ల తనిఖీ

సంగారెడ్డి: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో తెలంగాణ వైద్య మండలి వైస్ చైర్మన్ డాక్టర్ జి.శ్రీనివాస్, పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ వి.నరేష్ కుమార్, సభ్యుడు విష్ణు బృందం మూడు క్లినిక్‌లు, డయోగ్నొస్టిక్ కేంద్రాలపై సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఫసల్వాడి ప్రాంతంలోని జెమినీ క్లినిక్, మణికంఠ, ఫస్ట్‌ఎయిడ్ సెంటర్, పాత బస్టాండ్ ప్రాంతంలోని శ్రీనివాస క్లినిక్‌లను పరిశీలించారు. అనుమతి లేకుండా క్లినిక్‌లు ఏర్పాటు చేశారని తేలిసింది. రోగులకు ఇస్తున్న మందుల ఆధారాలు సేకరించారు. నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బృందం సభ్యులు తెలిపారు.



సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న వైద్యబృందం

పోలీసులపై నమ్మకం పెరగాలంటే..

- నిందితులకు శిక్ష పడాలి: ఎస్పీ చెన్నూరి రూపేష్
- చిన్న కేసులలో వారంలోపు చార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి జోన్: తమకు కేటాయించిన విధులను పూర్తి బాధ్యతతో నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ సూచించారు. సోమవారం తన కార్యాలయంలో స్టేషన్ రైటర్స్ కొరతను అధిగమించడానికి జిల్లాలో కొత్తగా నియామకమైన పోలీసు కానిస్టేబుళ్లకు మూడురోజుల శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నిందితులకు శిక్ష పడినప్పుడే ప్రజలకు పోలీసులపై నమ్మకం పెరుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ స్టేషన్ రికార్డుల గురించి తెలుసుకొని, పూర్తి అవగాహన కలిగి ఉండాన్నారు. స్టేషన్ రైటర్స్‌గా పూర్తి బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రతి కేసులో నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ చేసే విధంగా ఎస్‌హెచ్‌లకు సహకరించాలని కోరారు. ఫిర్యాదు మొదలుకొని చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని వివరంగా డ్రాఫ్ట్ చేస్తూ ఎదుటివారికి త్వరగా అర్థమయ్యేలా పదజాలాన్ని వాడాలన్నారు. చిన్న కేసులలో వారంలోపు చార్జిషీట్ దాఖలు చేసేవిధంగా స్పీడ్ వర్క్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు.ఎస్పీ ఎ.సంజీవ రావు, డీటీసీ డీఎస్పీ సురేందర్ రెడ్డి, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి, ట్రైనీ ఎస్ఐలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

క్యాంటిన్ ప్రారంభం

పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది పని ఒత్తిడి నుండి సేదతీరడానికి కార్యాలయ ఆవరణలో కేఫ్టేరియా, కాంటీన్‌ను ప్రారంభించామని ఎస్పీ తెలిపారు. తన కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ప్రారంభించి, అధికారులతో కలిసి టీ తాగారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వివిధ పోలీస్ స్టేషన్ల నుంచి కార్యాలయానికి వచ్చిన సిబ్బంది సేదతీరడానికి అనుకూలంగా ఉంటుందన్నారు.

అమరవీరుల స్తూపానికి నివాళులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట పట్టణంలోని రంగధాంపల్లి స్తూపం వద్ద పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి వేం నరేందర్‌రెడ్డి నామినేషన్‌కు కరీంనగర్‌కు వెళ్తూ మార్గమధ్యంలో సిద్దిపేటలో ఆగి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అంతకు ముందు కాంగ్రెస్ శ్రేణులు టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి జూపల్లికృష్ణారావు, షబ్బీర్ అలీ, మైనంపల్లి హనుమంతారావులకు జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. కార్యక్రమంలో గాడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, గాడిపల్లి రఘువర్ధన్‌రెడ్డి, పూజలహరికృష్ణ, గోపీకృష్ణ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న పీసీసీ చీఫ్ తదితరులు

జహీరాబాద్ మీదుగా బుల్లెట్ రైలు

- హైదరాబాద్- ముంబై మధ్య రైలు
- నాలుగు గంటలే ప్రయాణం
- గరిష్ట వేగం 350 కిలోమీటర్లు, సగటు వేగం 250 కిలోమీటర్లు
- 11 స్టేషన్లలో నిలిపేందుకు ప్రణాళికలు

జహీరాబాద్: జహీరాబాద్ మీదుగా హైదరాబాద్-ముంబైల మధ్య బుల్లెట్ రైలు కారిడార్‌ను నిర్మించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఆయా రైల్వే స్టేషన్ల మధ్య 711కిలోమీటర్ల మేర హైస్పీడ్ రైలు కారిడార్‌ను నిర్మించనున్నారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలోని 11 స్టేషన్లలో రైలును నిలిపేందుకు ప్రతిపాదించినట్లు సమాచారం. హైదరాబాద్ నుంచి బయల్దేరి జహీరాబాద్, బీదర్, కల్‌బుర్గి, పండరీపూర్, షోలాపూర్, పూణె, లోనావాలా మీదుగా ముంబైకు రైలును నడిపేందుకు ప్రతిపాదించినట్లు సమాచారం. ఆయా రైల్వే స్టేషన్లలో రైలును ఆపేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

2051 నాటికి పూర్తిచేయడమే లక్ష్యంగా..

దేశంలో ప్రతిపాదించిన ఆయా ప్రాంతాల్లో 2051 నాటికి బుల్లెట్ రైళ్లను నడిపేందుకు వీలుగా ప్రాజెక్టులను పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచన. ఈ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు 10 నుంచి 13 ఏళ్ల కాలం పట్టవచ్చని అంచనా. హైదరాబాద్-ముంబై మధ్య నడపనున్న బుల్లెట్ రైల్ కోసం కేంద్రం నేషనల్ రైల్ ప్లాన్(ఎన్ఆర్‌పీ)ని రూపొందించింది. ఫైనల్ లోకేషన్ సర్వే కోసం రైల్వేశాఖ టెండర్లను ఆహ్వానించింది. 24వ తేదీ వరకు బిడ్లను దాఖలు చేయాలని పేర్కొంది. 8 నెలల్లో సర్వే నివేదిక అందజేయాలని రైట్స్ సూచించింది. ఇందుకోసం అవసరమైన మేరకు నిధులను సైతం కేటాయించింది.

ఇంజనీరింగ్ అధికారుల సర్వే

ఇప్పటికే రైల్వేలైన్ నిర్మాణానికిగాను ఇంజనీరింగ్ అధికారులు పలు ప్రాంతాల్లో ప్రాథమిక సర్వే నిర్వహించారు. అవసరమైన చోట్ల మట్టి పరీక్షలు కూడా చేసి ప్రాథమిక నివేదికను ఇప్పటికే రైల్వే మంత్రిత్వశాఖకు అందజేశారు.

నాలుగు గంటల్లోనే గమ్యానికి

బుల్లెట్ రైలులో ముంబై నుంచి హైదరాబాద్‌కు కేవలం నాలుగు గంటల్లోనే చేరుకోవచ్చు. ఆయా స్టేషన్ల మధ్య దూరం 698 కిలోమీటర్లు. ప్రస్తుతం సుమారు 15గంటలు పడుతోంది. రైలు గరిష్ట వేగం 350కిలోమీటర్లుగా, సగటు వేగం 250 కిలోమీటర్లుగా, ఆపరేషన్ వేగం 320 కిలోమీటర్లుగా డీపీఆర్‌లో ప్రతిపాదించినట్లు సమాచారం. ఇప్పటికే బీదర్ నుంచి ముంబైకు ఎక్స్‌ప్రెస్ రైలు నడుపుతున్నారు.



పారిశ్రామిక ప్రాంతంగా జహీరాబాద్

జహీరాబాద్ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో మహీంద్ర, హట్సన్, ఆల్లానా, పిరామల్ ఫార్మా కంపెనీలతో పాటు పలు పరిశ్రమలు ఉన్నాయి. అంతే కాకుండా నిమ్జ్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నందున దేశంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటు కోసం 12,650 ఎకరాల భూమిని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే ఆరు వేల ఎకరాల మేర భూమిని సేకరించారు. ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో నిమ్జ్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నారు. బర్దీపూర్, ఎల్గోయి గ్రామాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రెండు పరిశ్రమలకు కలిపి సుమారు వేయి ఎకరాల భూములను సైతం కేటాయించింది. నిమ్జ్‌కు అనుసంధానంగా 165, 161 జాతీయ రహదారులు ఉన్నాయి.

జహీరాబాద్-తాండూల మధ్య కొత్త మార్గం

జహీరాబాద్ నుంచి తాండూరుకు కేంద్ర ప్రభుత్వం కొత్త రైలు మార్గాన్ని మంజూరు చేసింది. ఈ రైలు మార్గం ద్వారా ఆయా ప్రాంతాల మధ్య రాకపోకలు పెరగనున్నాయి. అంతేకాకుండా రెండు ప్రాంతాలు కూడా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నాయి. నిమ్జ్ ప్రాజెక్టుకు సేకరిస్తున్న భూములకు సమీపంలోనే ఇప్పటికే రైలు మార్గం ఉంది.

రూ.1.70 కోట్లతో గ్రంథాలయాల అభివృద్ధి

సంస్థ చైర్మన్ అంజయ్య యాదవ్

జోగిపేట(అందోల్): జిల్లాలోని జోగిపేట, నారాయణఖేడ్, రాయికోడ్ గ్రంథాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.1.70 కోట్లను మంజూరు చేసిందని ఆ సంస్థ చైర్మన్ అంజయ్య యాదవ్ తెలిపారు. సోమవారం జోగిపేటలో గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జోగిపేట, నారాయణఖేడ్‌కు గ్రంథాలయాలకు రూ.60 లక్షలు చొప్పున, అలాగే.. రాయికోడ్ లైబ్రరీ నిర్మాణానికి రూ.50 లక్షలు నిధులను కేటాయించినట్లు తెలిపారు. గ్రంథాలయాలను ఆధునికీకరణ చేస్తామన్నారు. పాఠకులకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుతున్నామని ఆయన పేర్కొన్నారు.

పాఠశాలల్లో కూడా లైబ్రరీలు

పాఠశాలలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో లైబ్రరీల నిర్వహణకు సహకరిస్తామని చైర్మన్ అంజయ్య తెలిపారు. జోగిపేట బాలుర ఉన్నత పాఠశాలలోని గదిలో ఏర్పాటు చేసిన పుస్తకాలను ప్రధానోపాధ్యాయుడు నరేష్ చూపించారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను పంపిణీ చేసేందుకు సహకరించాలని కోరగా, పాఠశాల తరఫున ఒక తీర్మానాన్ని జిల్లా కేంద్ర కార్యాలయంలో ఇవ్వాలని చైర్మన్ సూచించారు. ఆయన వెంట ఎంఈఓ బండి కృష్ణ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.మాణయ్య, జోగిపేట అధ్యక్షుడు నరోత్తం తదితరులు పాల్గొన్నారు.



జోగిపేటలోని పాఠశాలలో పుస్తకాలను పరిశీలిస్తున్న జిల్లా చైర్మన్ అంజయ్య యాదవ్

ఏడీ కార్యాలయం ఏదీ?

- ఇక్కడి ఆఫీసు సిద్దిపేటకు తరలింపు
- ఏడాది క్రితం మరో ఏడీ కార్యాలయం జిల్లాకు మంజూరు
- దాన్ని కూడా హైదరాబాద్‌లోనే కొనసాగింపు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ప్రభుత్వ కార్యాలయాల విషయంలో సంగారెడ్డి జిల్లాపై వివక్ష కొనసాగుతూనే ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లాకు పాలనాపరమైన జిల్లా కేంద్రమైన సంగారెడ్డి నుంచి పలు శాఖల కార్యాలయాలు ఇక్కడి నుంచి ఒక్కొక్కటిగా తరలిపోవడం పరిపాటిగా తయారైంది. ఇప్పటికే పలు ఇంజనీరింగ్‌శాఖల కీలక కార్యాలయాలు సిద్దిపేటకు తరలిపోగా., ఇదే క్రమంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన ఔషధ నియంత్రణశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయాన్ని గుట్టు చప్పుడు కాకుండా అక్కడికే తరలించారు. ఈ జిల్లాకు కొత్తగా మరో అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఈ కార్యాలయాన్ని కూడా జిల్లాలో ఏర్పాటు చేయకుండా కొంత కాలంగా హైదరాబాద్‌లోనే కొనసాగిస్తుండటం గమనార్హం. పేరుకు సంగారెడ్డి కార్యాలయమైనా.. కార్యకలాపాలన్నీ హైదరాబాద్‌లోని వెంగళరావునగర్‌లో ఉన్న ఔషధ నియంత్రణ శాఖ ప్రధాన కార్యాలయం నుంచే నడిపిస్తుండటం విశేషం.

ఫార్మా కంపెనీలన్నీ జిల్లాలోనే..

ఫార్మా రంగానికి సంగారెడ్డి జిల్లా పెట్టింది పేరు. రాష్ట్రంలోనే అత్యధిక ఫార్మా కంపెనీలు ఉన్న జిల్లాల్లో సంగారెడ్డి మూడో స్థానంలో ఉంటుంది. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి తర్వాత అత్యధిక ఫార్మా పరిశ్రమలున్నవి సంగారెడ్డిలోనే. ఫార్మాతో పాటు బల్ డ్రగ్, కెమికల్ పరిశ్రమలు వందల సంఖ్యలో ఉంటాయి. ఈ ఫార్మా రంగానికి సంబంధించి కేవలం చిన్న, మధ్య తరహా పరిశ్రమలే కాదు, సుమారు 50 వరకు భారీ పరిశ్రమలు కూడా ఉన్నాయి. ఈ పరిశ్రమల కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంలో అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం కీలకం. నిబంధనల మేరకు ఈ పరిశ్రమలు పనిచేస్తున్నాయా? వీటిలోని ఉత్పత్తి ఎలా కొనసాగుతోంది.. తదితర అంశాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ పర్యవేక్షించాల్సి ఉంటుంది. అయితే ఈ కార్యాలయం గుట్టుచప్పుడు కాకుండా సిద్దిపేటకు తరలిపోయిన తర్వాత ఈ పరిశ్రమలపై పెద్దగా పర్యవేక్షణ కరువైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాకు మంజూరైన మరో కార్యాలయం హైదరాబాద్‌నుంచి కార్యకలాపాలు సాగిస్తుండటంతో జిల్లాలోనే స్థానికంగా ఉండాల్సిన సంబంధిత అధికారులు ఇక్కడికి చుట్టపుచూపుగా వచ్చి వెళుతున్నారు.



పట్టింపు లేని ప్రజాప్రతినిధులు

జిల్లాకు చెందిన ప్రభుత్వ కార్యాలయాలు ఇతర జిల్లాలకు తరలిపోవడం పరిపాటిగా తయారైనా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పట్టింపు లేకుండా వ్యవహరించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఒక ప్రాంతంలో ఉన్న కార్యాలయం మరో ప్రాంతానికి వెళితే ప్రశ్నించాల్సిన ప్రజాప్రతినిధులు నోరెత్తకపోవడంతో ఈ పరిస్థితి ఇలాగే కొనసాగుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇకనైనా స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి జిల్లాకు చెందిన కార్యాలయాన్ని సంగారెడ్డిలో ఏర్పాటు చేయించేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్లపైనా ఆజమాయిషీ కరువు

జిల్లాలో ఏడు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలు ఉన్నాయి. వీరందరి పనితీరును పర్యవేక్షించాల్సింది కూడా ఈ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయమే. ఈ కార్యాలయం ఇక్కడ లేకపోవడంతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల పనితీరుపై పర్యవేక్షణ కరువవుతోంది. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు మెడికల్ షాపులు, ఆస్పత్రులు, బ్లడ్‌బ్యాంకులు, ఆక్సిజన్ తయారీ కేంద్రాలను నిత్యం తనిఖీలు చేసి అవి నిబంధనలు పాటించేలా చూడాల్సి ఉంటుంది. వీరి పనితీరును అసిస్టెంట్ డైరెక్టర్ పర్యవేక్షించాలి. కార్యాలయమే ఇక్కడ లేకపోవడంతో ఈ డ్రగ్ ఇన్‌స్పెక్టర్లపై ఆజమాయిషీ లేకుండా పోయింది.

క్లుప్తంగా

మోదీ 'పరీక్షా పే చర్చ'

వీక్షించిన నవోదయ విద్యార్థులు



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

వర్గల్(గజ్వేల్): విద్యార్థుల్లో భయాందోళన తొలగించడమే లక్ష్యంగా సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించగా వర్గల్ నవోదయ విద్యార్థులు ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. ఎంపీ హాల్‌లో ఇందుకోసం బిగ్‌స్క్రీన్ ఏర్పాటు చేశారు. పరీక్షల తరుణంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కావొద్దని మోదీ ఈ కార్యక్రమం ద్వారా పలు సూచనలు చేశారని ప్రిన్సిపాల్ దాసీ రాజేందర్ పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో ప్రతీ విద్యార్థి ఇతరులతో కాకుండా తన తోతాను పోటీ పడి లక్ష్యాలు సిద్ధించుకోవాలని సూచించినట్లు వివరించారు. కార్యక్రమం విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిందన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పుష్పవేణి

చిన్నశంకరంపేట(మెదక్): హైదరాబాద్‌లో నిర్వహించిన ఫోర్త్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి జెడ్పీపాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. మార్షల్ ఆర్ట్స్ కటాఫ్ విభాగంలో కె.రేణుక బంగారు పతకం, కావ్య, అనుషా రజత పతకాలు సాధించినట్లు ఎంఈఓ పుష్పవేణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదుపై..

పోతిరెడ్డిపల్లిలో ఏసీపీ విచారణ



విచారణ చేస్తున్న ఏసీపీ సతీశ్

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి సంబంధించి ఇటీవలె వచ్చిన ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదుపై సోమవారం హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ విచారణ చేశారు. గ్రామస్తులతో ఏసీపీ మాట్లాడుతూ.. త్వరలో జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అందరూ కలిసిమెలిసి ఉంటూ పాల్గొనాలని సూచించారు. శాంతి భద్రతలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నడుచుకోవాలన్నారు. గ్రామంలో ప్రజల రక్షణకు, సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీస్‌శాఖకు సహకరించాలన్నారు. గ్రామంలో అనుమానాస్పదంగా ఎవరైనా కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేదంటే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీను, ఎస్ఐ నీరేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంసీహెచ్ కేంద్రం ప్రారంభానికి గ్రహణం

నిరుపయోగంగా మాతా శిశు ఆరోగ్య కేంద్రం

హుస్నాబాద్ పట్టణంలో నిర్మించిన మాతా శిశు ఆరోగ్య కేంద్రం ప్రారంభానికి గ్రహణం వీడటం లేదు. భవన నిర్మాణం పూర్తయి ఏడాది అవుతున్నా ఇంకా తెరుచుకోవడం లేదు. దీంతో మహిళలు ప్రసవాల కోసం పట్టణాలు, నగరాలకు వెళ్లాలంటే ఎంతో ప్రయాసతోపాటు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రసవాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే కాన్పులు జరిగేలా చేసేందుకు నిర్మించిన మాతా శిశు ఆరోగ్య కేంద్ర భవనానికి మోక్షం ఎప్పుడని హుస్నాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

– హుస్నాబాద్

- భవనం పూర్తయి ఏడాది
- రూ.12.50 కోట్లతో 50 పడకలు
- డాక్టర్లు, సిబ్బంది నియామకాల్లో ప్రభుత్వం జాప్యం
- వైద్య పరికరాలు సిద్ధం
- అందుబాటులోకి వస్తే ప్రసవాలు సులభతరం
- హుస్నాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రజలకు తప్పని తిప్పలు



ప్రారంభానికి నోచుకోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం

హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో కాన్పులు స్థానికంగా జరిగేలా 50 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. రూ.12.50 కోట్లు వ్యయం కాగల ఈ ఆరోగ్య కేంద్రానికి 5, డిసెంబర్, 2022న అప్పటి మంత్రి హరీశ్ రావు శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణం పూర్తి చేసి దాదాపు ఏడాది అవుతుంది. కానీ నేటికీ అందుబాటులోకి రాని పరిస్థితి నెలకొంది. ఇది ప్రారంభిస్తే నియోజకవర్గంలోని 7 మండలాలకు ఎంతోగానో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా నిరుపేద మహిళలు ప్రసవాల కోసం పట్టణాలకు వెళ్లే పరిస్థితి ఉండదు.

సిద్ధంగా వైద్య పరికరాలు

మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి వస్తే గర్భిణులు, పుట్టబోయే పిల్లలకు ఆరోగ్య పరంగా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. నిర్మాణం పూర్తి చేసుకున్న మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ప్రస్తుతం వైద్య పరికరాలు అన్ని సిద్ధంగా ఉన్నాయి. ఆస్పత్రి భవనంలో విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. భవనాన్ని ప్రభుత్వానికి అప్పగించేంత వరకు ఆస్పత్రి భవన భద్రత అంతా సంబంధిత కాంట్రాక్టర్‌దే. భవనం వెనుకాల పాఠశాల గ్రౌండ్‌లో విద్యార్థులు ఆటలు ఆడుతుండగా కిటికీల అద్దాలు పగిలిపోతున్నాయి. భవనం పాడైపోక ముందే స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ చూపి డాక్టర్లు, సిబ్బంది నియామకం జరిగేలా చర్యలు తీసుకొని ఆస్పత్రిని త్వరగా ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

సిబ్బంది నియామకం లేకపోవడమేనా..



ఎంసీహెచ్ భవనం పూర్తి కాగా ఏడాది నుంచి ప్రభుత్వం డాక్టర్లు, వైద్య సిబ్బందిని నియమించకపోవడంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇదే ప్రధాన కారణంగా స్థానికులు చెబుతున్నారు. దాదాపు 100 మంది వరకు డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఇతర సిబ్బంది ఆస్పత్రికి అవసరం ఉంది. ముఖ్యంగా గైనకాలజిస్ట్, పిల్లల వైద్య నిపుణులు, అనెస్తీయా, రేడియాలజిస్ట్‌లు 24 గంటలు పర్యవేక్షణలో ఉండి తల్లి, బిడ్డలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది. స్టాఫ్ నర్సులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, స్కానింగ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు కావాలి రోజు వారి చెకప్ కోసం ప్రత్యేక సిబ్బంది కూడా అవసరం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు జరుగుతున్నా సరిపోయేంత డాక్టర్లు, పరికరాలు అందుబాటులో లేకపోవడంతో క్రిటికల్‌గా ఉన్న కేసులను ఇతర పట్టణాల్లో ఉండే ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. మాతా శిశు కేంద్రం అందుబాటులోకి వస్తే నిష్ణాతులైన డాక్టర్లతో ఎంతటి సీరియస్‌గా ఉన్నప్పటికీ ఇక్కడే ప్రసవం జరిగే అవకాశం ఉంటుంది.

డాక్టర్లను నియమించాల్సి ఉంది



మాతా శిశు ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం పూర్తయింది. వైద్య పరికరాలు కూడా వచ్చాయి. డాక్టర్లు, సిబ్బందిని నియమించాల్సి ఉంది. ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా ఇతర పట్టణాలకు వెళ్లకుండా కాన్పులు ఇక్కడే జరుగుతాయి. ఎంతటి క్రిటికల్ కాన్పులైన ఇక్కడే జరిపేలా నిష్ణాతులైన వైద్య నిపుణులు ఉంటారు. ఈ ప్రాంత ప్రజలకు ఈ ఆరోగ్య కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతోంది.

– డాక్టర్ రమేశ్ రెడ్డి, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్, హుస్నాబాద్

భారీ అగ్ని ప్రమాదం

- రూ.30 లక్షలకు పైగా ఆస్తి నష్టం
- ఎలక్ట్రానిక్స్ దుకాణంలో సామగ్రి దగ్ధం



కాలి బూడిదైన సామగ్రి

జహీరాబాద్: ఎలక్ట్రానిక్స్ దుకాణంలో సోమవారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జహీరాబాద్ పట్టణంలోని సుభాష్‌గంజ్ క్రాస్‌రోడ్డు వద్ద స్థానికుడు శంకర్ ఎలక్ట్రానిక్స్ దుకాణం నడుపుతున్నాడు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఎలక్ట్రిక్ వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని షటర్లను పగులగొట్టి మంటలార్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.30 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు యజమాని తెలిపారు.

కోర్టు ఆదేశాలు బేఖాతర్

వ్యక్తి రిమాండ్

మిరుదొడ్డి(దుబ్బాక): కోర్టు ఆదేశాలను బేఖాతర్ చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు మిరుదొడ్డి ఎస్ఐ బోయిని పరుశరాములు తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన కథనం ప్రకారం.. మండల పరిధిలోని అల్వాల గ్రామ పంచాయతీ మధిర గ్రామం రాంనగర్‌కు చెందిన గండ్ల గణేశ్ 2019లో పోలీసులతో దుర్భాషలాడుతూ దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కొద్ది రోజులకు బెయిల్ ద్వారా బయటకు రాగా కేసులో భాగంగా అప్పుడప్పుడూ కోర్టుకు హాజరుకావాల్సి ఉంది. కానీ గతేడాది కాలంగా గణేశ్ కోర్టుకు హాజరు కాకుండా పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నాడు. సోమవారం గణేశ్‌ను చాకచక్యంగా పట్టుకున్నామని తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

డ్రోన్‌ల వినియోగంపై చర్చ

ములుగు(గజ్వేల్): ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో డ్రోన్ సెంటర్ ఏర్పాటు, ఉద్యాన పంటల్లో డ్రోన్‌ల వినియోగంపై సోమవారం అధికారులు సమావేశం నిర్వహించారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ దండా రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, రిమోట్ పైలెట్ ట్రెనింగ్ ఆర్గనైజేషన్ అధికారులతో పలు అంశాలపై చర్చించారు. ఇందులో భాగంగా ఉద్యాన పంటలకు డ్రోన్ టెక్నాలజీ అప్లికేషన్లలో సహకారాన్ని పెంపొందించడానికి కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌తో ఒక అవగాహన ఒప్పందం(ఎంఓయు) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రధాన ఉద్యాన పంటల్లో డ్రోన్ ఆధారిత అప్లికేషన్ల కోసం కచ్చితమైన వ్యవసాయ పద్ధతులను నిర్మించడానికి ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని (ఎస్ఓపీ)అభివృద్ధి చేయడంపై చర్చించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ, ఆయా సంస్థల అధికారులు జీవీ సుబ్బారెడ్డి, రామకృష్ణ, వినోద్ కులకర్ణి, భగవాన్, రాజశేఖర్, విజయ, సీనివాసన్, సునందిని, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులు

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

- రైల్వే ఉద్యోగికి తీవ్ర గాయాలు
- బైక్‌ను ఢీకొట్టిన కారు

రామాయంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందగా, మరో రైల్వే ఉద్యోగికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని అక్కన్నపేట గ్రామ శివారులో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. అక్కన్నపేటకు చెందిన సల్లావుద్దీన్ కాట్రియాల జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. స్కూల్ అయిపోయాక బైక్‌పై అక్కన్నపేట వస్తున్నాడు. దారిలో లక్ష్మాపూర్ వద్ద రైల్వేశాఖ గ్యాంగ్‌మెన్‌గా పని చేస్తున్న అక్కన్నపేటకు చెందిన అశోక్ సల్లావుద్దీన్‌ను లిఫ్ట్ అడిగి ఎక్కాడు. వీరు అక్కన్నపేట అటవీ ప్రాంతంలోకి రాగానే ఎదురు వచ్చిన కారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. ఇందులో చిక్సి పొందుతూ సల్లావుద్దీన్ మృతి చెందాడు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

అల్లాదుర్గం(మెదక్): రైసుమిల్లులో అనుమానస్పందంగా వ్యక్తి మృతి చెందారు. ఈ ఘటన అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్ రైసు మిల్లులో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి కథనం మేరకు.. రాంపూర్ గ్రామంలోని ఉమా సంగమేశ్వర రైస్ మిల్లులో గ్రామానికి చెందిన గోండ కృష్ణ (28) కూలీగా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులు నిర్వహించి ఉదయం వెళ్లిపోయాడు. కొద్దిసేపటికే కృష్ణ మరో ఇద్దరు వ్యక్తులతో బైక్‌పై మిల్లుకు వచ్చాడు. మిగితా ఇద్దరు వెళ్లిపోయారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో రైసుమిల్లు సంపులో మృతదేహమై కనిపించాడు. తోటి కూలీలు కృష్ణ మృతదేహాన్ని బయటకు తీసి అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది చనిపోయాడని చెప్పడంతో కుటుంబ సభ్యులకు, పోలీసులకు చెప్పారు. కృష్ణ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేయగా, సోమవారం కృష్ణ పనికి రాలేదని మిల్లు యజమానులు చెబుతున్నారు. మృతురాలి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



కృష్ణ (ఫైల్)

బస్టాండ్ పరిసరాలను పరిశీలించిన పొన్నం



మాట్లాడుతున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని పలు కాలనీలు, బస్టాండ్ పరిసరాలను సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఓ హోటల్ వద్ద టిఫిన్ చేస్తున్న మహిళా ప్రయాణికులతో ముచ్చటించారు. బస్టాండ్ పరిసరాల్లో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో కొంత భాగాన్ని కోల్పోతున్న షాపులను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు ఉన్నారు.

సంజీవ్ మృతిపై మళ్లీ విచారణ

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ వర్కర్‌గా పనిచేసే సంజీవ్ ఇటీవల డంప్‌యార్డ్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పట్లో ఆత్మహత్యగా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, మృతుడి సెల్‌ఫోన్‌లో దొరికిన ఆధారాలతో కేసును మరోసారి ఆ దిశగా విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా మెదక్ మున్సిపాలిటీలోని మున్సిపల్ అధికారులను, సిబ్బందిని విచారిస్తున్నట్లు సమాచారం. సోమవారం సాయంత్రం కొంతమంది సిబ్బందిని విచారణకు తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ విషయమై పట్టణ సీఐ నాగరాజును వివరణ కోరగా కేసు విచారణ కొనసాగుతుందన్నారు.

పకడ్బందీగా ఇంటర్ ప్రాక్టికల్స్

- డీఐఈఓ రవీందర్ రెడ్డి
- దుబ్బాకలో పరీక్ష కేంద్రాల ఆకస్మిక తనిఖీ

దుబ్బాకటౌన్: జిల్లాలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, జిల్లా ఇంటర్మీడియట్ పరీక్షల కమిటీ కన్వీనర్ రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కళాశాల, వాగ్దేవి జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రెండో విడత ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి, కమిషనర్ కృష్ణాదిత్య ఆదేశాల మేరకు అన్ని ప్రయోగ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 62 కేంద్రాల్లో అన్ని విడతల్లో జనరల్, ఒకేషనల్ గ్రూపులకు 11,090 మంది విద్యార్థులు ప్రయోగ పరీక్షలు రాస్తున్నారన్నారు. వచ్చే నెల 5వ తేదీ నుంచి వార్షిక పరీక్షలు కొనసాగుతాయని, అందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యుడు గంగాధర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి చీఫ్ సూపరింటెండెంట్ శివకుమార్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న డీఐఈఓ రవీందర్ రెడ్డి

కంది రైతులకు ఆన్‌లైన్ రంది

దళారులకు అమ్ముకుంటున్న పరిస్థితి

హుస్నాబాద్‌రూరల్: కంది రైతులకు ఆన్‌లైన్ రంది తప్పేలా లేదు. రైతులు పండించిన కందులను మద్దతు ధరకు అమ్ముకునేందుకు హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో అధికారులు కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. సోమవారం కోహెడ మండలానికి చెందిన మంద శంకర్ పండించిన 10 క్వింటాళ్ల కందులను అమ్మేందుకు కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాడు. కానీ అతడి పేరు ఆన్‌లైన్‌లో లేదని కందులు కొనుగోలు చేయమని నిర్వాహకులు చెప్పారు. రైతు దంపతులు ఏం చేయలేక మార్కెట్‌కు తెచ్చిన కందులను సంచుల్లో నింపి బయట దళారీకి రూ.6,500కి అమ్ముకొని వెళ్లిపోయాడు. ఏఈఓలు పత్తి పంటను నమోదు చేసినప్పుడు కంది పంట నమోదు చేయాలె కదా? అధికారుల నిర్లక్ష్యంతోనే రూ.2 వేలు ఆటో కిరాయి నష్టం, క్వింటాల్‌కు రూ.1,000 నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు. కలెక్టర్ స్పందించి రైతులకు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి అమ్ముకొనేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.



మార్కెట్‌కు కందులను తీసుకెళ్తున్న రైతులు

వేర్వేరు చోట్ల నలుగురు బలవన్మరణం

అప్పుల బాధతో వ్యక్తి

గజ్వేల్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని గిరిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బండారు రవీందర్(35)కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కుటుంబ పోషణ, పంటల సాగుకు సుమారు రూ.4.5లక్షల వరకు అప్పులు చేశాడు. ఇవి తీర్చే మార్గంలేక తీవ్ర మనోవేదనకు గురైన సోమవారం వ్యవసాయం పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్య సమస్యలతో..

చేగుంట(తూప్రాన్): జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కర్నాల్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన కోప్పుల్లపల్లి బాలయ్య(79) కొద్ది రోజులుగా శ్వాసకోస సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చూయించుకున్నా వ్యాధి నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఆదివారం సాయంత్రం పొలం పనులకని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం కుటుంబ సభ్యులు వెతుకుతుండగా స్థానిక చెరువు గట్టు వద్ద బాలయ్య చెప్పులను గుర్తించారు. చెరువులో వెతకగా బాలయ్య మృతదేహం లభించింది. మృతుడి కుమారుడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది..



రాజు(ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. హుస్నాబాద్ మండలం మడద గ్రామానికి చెందిన పత్తి రాజు(45), శ్రీలత దంపతులు వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం భార్య ఉపాధి పనికి వెళ్లగా జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఉరేసుకొని యువకుడు

మనోహరాబాద్(తూప్రాన్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముప్పిరెడ్డిపల్లి శివారులో ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. మృతుడి వద్ద ఆధార్ కార్డు చూడగా ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం జంజీర్ చంపాకు చెందిన రాహుల్‌కుమార్ (25)గా తెలిసింది. ఈ విషయంపై ఎస్ఐ సుభాష్‌గౌడ్‌ని వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, ఇక్కడ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడని విచారణ చేస్తున్నామన్నారు.

అక్రమ రవాణాకు అడ్డేది?

- రామాయంపేట కేంద్రంగా కలప తరలింపు
- స్టాక్ నిల్వచేసి మరీ లారీల్లో ఇతర ప్రాంతాలకు
- అనుమతులు లేకుండానే చెట్లు నరికివేత
- పట్టించుకోని అధికారులు

రామాయంపేట(మెదక్): రామాయంపేట కేంద్రంగా కొద్ది రోజులుగా అక్రమ కలప రవాణా జోరుగా కొనసాగుతోంది. యూకలిప్టస్, సుబాబుల్ చెట్లను సమీప ప్రాంతాల్లో నరికివేసి ముందుగా రామాయంపేట మున్సిపాలిటీ శివారులో స్టాక్ నిల్వ చేస్తున్నారు. అనంతరం ఆదివారం, ఇతర సెలవు దినాలు, రాత్రివేళల్లో నాలుగైదు లారీలు, ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ వ్యవహారానికి గాను సంబంధిత శాఖ అధికారుల అండదండలున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూకలిప్టస్ చెట్లు నరకాలంటే ముందస్తు సంబంధిత పంచాయతీ కార్యదర్శి అనుమతితోపాటు దానిని తరలించి స్టాక్ పెట్టడానికిగాను అటవీశాఖ అధికారుల అనుమతులు తప్పనిసరి. దీంతోపాటు ప్రతీ చెట్టుకు రూ.50 ముందుగానే ఆన్‌లైన్‌లో చెల్లించి అనుమతులు పొందాలి. ఇవేమి లేకుండానే యథేచ్ఛగా అక్రమ రవాణా కొనసాగుతుంది. నామమాత్రంగా రెండు, మూడు చెట్లకు ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి మిగితా వాటిని అక్రమంగా నరికేసి సొమ్ము చేసుకుంటున్నారు . రామాయంపేట కేంద్రంగా ముగ్గురు కాంట్రాక్టర్లు కలప వ్యాపారం పెద్ద ఎత్తున కొనసాగిస్తున్నారు. అలాగే, వేప, చింత, ఇతర చెట్లను నరకాలంటే ముందస్తుగా దరఖాస్తు చేసుకొని డబ్బులు చెల్లించి అనుమతులు పొందాల్సి ఉండగా, ఇవేమీ లేకుండానే లారీల్లో, ట్రాక్టర్లలో నేరుగా హైదరాబాద్, సమీపంలోని సామిల్లకు తరలిస్తున్నారు. ఈ విషయమై సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమ రవాణా పెద్ద ఎత్తున కొనసాగుతుంది.



రామాయంపేట శివారులో లారీలో కలప తరలింపు

అనుమతులు తప్పనిసరి

కలపను నరికి స్టాక్ పెట్టాలంటే ముందస్తుగా అనుమతులు తీసుకోవాలి. రామాయంపేటలో మాత్రం స్టాక్ పెట్టడానికి అనుమతి తీసుకోలేదు. యూకలిప్టస్ చెట్లు తొలగించాలంటే ముందుగా సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి అనుమతులు పొంది చెట్టుకు రూ. 50 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇటీవల దాడులు నిర్వహించి కలప తరలిస్తున్న పది వాహనాలకు జరిమానాలు విధించాం.

– శ్రీను నాయక్, డిప్యూటీ రేంజ్ అధికారి, రామాయంపేట